www.eenadupratibha.net

# BOARD OF SECONDARY EDUCATION (AP)

## SUMMATIVE ASSESSMENT – I

## TENTH TELUGU MODEL PAPER

## PAPER – I

| సమయం: 2 గం.45 ని. | పార్ట్ A & B | మొత్తం మార్కులు: 40 |
|---|---|---|
| సమయం: 2 గం. | పార్ట్ – A | మొత్తం మార్కులు: 30 |

సూచనలు:

i) ప్రశ్నపత్రం చదవుకోడానికి అదనంగా 15 నిమిషాల సమయం ఉంటుంది.

ii) పార్టు – A ప్రశ్నపత్రానికి సంబంధించిన సమాధానాలు జవాబు పత్రంలోనూ, పార్టు – B ప్రశ్నపత్రానికి సంబంధించిన జవాబులు అదే ప్రశ్నపత్రంలో రాయాలి.

**I. అవగాహన – ప్రతిస్పందన (12 మార్కులు)**

**1. కింది పద్యాల్లో ఒకదానికి ప్రతిపదార్థం రాయండి.** **4 × 1 = 4**

**(అ)** నీరము తప్తలోహమున నిల్చి యనామకమైనశించు, నా
నీరము ముత్యమట్లు నళినీదళ సంస్థిమై తనర్చునా
నీరమె శుక్తిలోబడి మణిత్వముగాంచు సమంచిత ప్రభన్
పౌరుషవృత్తులిట్లధమ మధ్యమనుత్తము గొల్చువారికిన్

**(ఆ)** సురుచిరతారకాకుసుమశోభి నభోంగణభూమిఁ గాలమ
న్గరువపుసూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపఁగ నిశాసతి కెత్తిన క్రొత్తతోఁపుఁబెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమదిక్తటంబునన్

**2. కింది పద్యాల్లో ఒకదాన్ని పాదభంగం లేకుండా పూరించి, భావం రాయండి.** **4**

**(అ)** "ఆ - యేమీ? ఒకరాణివాసమును ....
.... యౌద్ధత్యమోర్వన్ జుమీ".

**(ఆ)** దెసలను కొమ్మలొయ్య ....
.... బ్రాకెసమత్సుకాకృతిన్

**కింది పరిచిత గద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.** **4 × 1 = 4**

అర్థములు నిత్యములు గావు. యౌవనముర్ఝురీవేగతుల్యము. జీవనము బుద్బుదప్రాయము. కాబట్టి బుద్ధిమంతుడు సత్వరముగా ధర్మము సమాచరింపవలెను. సమాచరింపనివాడు పశ్చాత్తాపము బొంది శోకాగ్ని సంతప్తుడగును. నీవతి సంచయము చేసితివి. దాని దోషమిది. కాబట్టి యతి సంచయేచ్ఛ తగదు.

ప్రశ్నలు:

**3.** జీవనం ఎలాంటిది?

**4.** బుద్ధిమంతుడు దేన్ని సమాచరింపవలెను?

www.eenadupratibha.net

5. ధర్మాన్ని సమాచరింపనివాడు ఏమవుతాడు?

6. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

**II. వ్యక్తీకరణ – సృజనాత్మకత (18 మార్కులు)**

**1) కింది లఘు ప్రశ్నలకు 5 – 6 వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

**2) ప్రతి ప్రశ్నకు 2 మార్కులు.**

**3) అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి.** **4 × 2 = 8**

7. దాశరథీ శతకకర్త గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.

8. ధన్యుడు పాఠ్యభాగ నేపథ్యం రాయండి.

9. దీనులకు అన్నదానం చేస్తే కలిగే మేలు ఏమిటి?

10. కాలం విలువైందని సమర్థిస్తూ నాలుగు వాక్యాలు రాయండి.

**కింది ప్రశ్నల్లో ఒక్కోదానికి 10 – 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.** **2 × 5 = 10**

11. శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించి, ఆయన మనందరికీ ఎలా ఆదర్శప్రాయుడో వివరించండి.

**(లేదా)**

వెన్నెల ఎలా విస్తరించిందో వర్ణిస్తూ రాయండి.

12. చరిత్ర నిర్మాతలుగా స్త్రీలే ప్రధానంగా ఉన్నారని సమర్థిస్తూ రాయండి.

**(లేదా)**

రాజధానిగా అమరావతిని ఎంచుకోవడానికి కారణాలు రాయండి.

సమయం: 30 ని. | పార్ట్ – B | మొత్తం మార్కులు: 10

సూచన: పార్ట్ – Bకి సంబంధించిన సమాధానాలు ఈ ప్రశ్నపత్రంలోనే రాసి పార్ట్ – A సమాధాన పత్రానికి జత చేయాలి.

$20 \times \frac{1}{2} = 10$

**III. భాషాంశాలు**

కింద గీతగీసిన పదాలకు సరైన సమాధానాన్ని బ్రాకెట్లలో గుర్తించండి.

**1.** జోలపాడిన పురంధ్రీ లలామ! (అర్థాన్ని గుర్తించండి.) ( )

1) పురం 2) కుటుంబ స్త్రీ 3) దేవత 4) మూర్ఖురాలు

**2.** చూడాకర్ణుండను పరివ్రాజకుడు కలడు. (అర్థాన్ని గుర్తించండి.) ( )

1) సన్యాసి 2) పుణ్యాత్ముడు 3) ధర్మాత్ముడు 4) పండితుడు

**3.** ఆకసమును పేరి భూరుహము (పర్యాయపదాలు గుర్తించండి.) ( )

1) వెన్నెల, కౌముది 2) చెట్టు, వృక్షం 3) న్యాయం, ధర్మం 4) చీకటి, తమం

**4.** జ్ఞానేంద్రియాల్లో నేత్రం ప్రధానం. కన్ను లేనిదే చూడలేం. (సరైన పర్యాయ పదాన్ని గుర్తించండి.) ( )

1) ఆదేశం 2) దేవత 3) నాలుక 4) నయనం

**5.** మూషికం (వ్యుత్పత్యర్థం గుర్తించండి) ( )

1) అన్నాదులను దొంగిలించేది 2) భూమి నుంచి మొలిచేది

3) గృహమును ధరించేది 4) కరము గలది

**6.** పతిని సేవించుటయే వ్రతముగా గలది. (వ్యుత్పత్యర్థం గుర్తించండి) ( )

1) పురంధ్రి 2) పతివ్రత 3) అంగన 4) రాణి

**7.** ప్రతిఒక్కరూ పుణ్యము ఆచరింపవలె! (వికృతిని గుర్తించండి.) ( )

1) పూణ్యం 2) పుణ్యాం 3) పున్నెం 4) పణ్యం

**8.** మాదెస చూడుము. (ప్రకృతిని గుర్తించండి.) ( )

1) దెశ 2) దిశ 3) దిస 4) దేశ

**9.** వనమున కేగెను. (నానార్థాలు గుర్తించండి.) ( )

1) అడవి, అటవి 2) తోట, మాట

3) అడవి, నీరు 4) నీరు, పానీయం

**10.** నదీప్రవాహంలో పిల్లకాలువ పరంపరలు కలుస్తున్నాయి. (సరైన నానార్థ పదాన్ని గుర్తించండి.) ( )

1) వెన్నెల 2) కౌముది 3) వెలుగు 4) వెల్లి

**11.** గుణవంతురాలు ఆ ఇల్లాలు. (సంధి విడదీయండి) ( )

1) గుణవంత + ఆలు 2) గుణవంతు + రాలు

3) గుణమంత + ఆలు 4) గుణ + వంతురాలు

**12.** దివసేంద్రుడు జూచె! (ఏ సంధి?) ( )

1) సవర్ణదీర్ఘ సంధి 2) వృద్ధి సంధి 3) గుణ సంధి 4) అకార సంధి

**13.** కలువకన్నులు ఆమెవి. (గీతగీసిన పదం ఏ సమాసం) ( )

1) విశేషణా పూర్వపద 2) ఉపమాన పూర్వపద

3) రూపక 4) సంభావనా పూర్వపద

**14.** కిందివాటిలో ద్విగు సమాసానికి ఉదాహరణను గుర్తించండి. ( )

1) దశకంఠుడు 2) బ్రహ్మలోకం

3) ముప్పై సంవత్సరాలు 4) స్త్రీ పురుషులు

**15.** స, భ, ర, న, మ, య, వ (ఏ పద్యానికి చెందిన గణాలు) ( )

1) ఉత్పలమాల 2) చంపకమాల 3) శార్దూలం 4) మత్తేభం

**16.** చంపకమాల (యతిస్థానం ఎన్నో అక్షరం?) ( )

1) 11 2) 12 3) 13 4) 14

**17.** "పట్టుగనీశ్వరుండు తన పాలిట నుండి పుడిచ్చినంతలో"! (ఏ పద్యపాదమో గుర్తించండి) ( )

1) మత్తేభం 2) శార్దూలం 3) ఉత్పలమాల 4) చంపకమాల

**18.** "నీ కరుణాకటాక్ష వీక్షణముల్లకై నిరీక్షించుచున్నారము" (ఈ వాక్యంలోని అలంకారమేది?) ( )

1) ఛేకానుప్రాస 2) లాటానుప్రాస 3) వృత్యానుప్రాస 4) యమకం

**19.** అభినుతేందుచంద్రికాంబోధి (ఈ వాక్యంలోని అలంకారమేది?) ( )

1) ఉపమా 2) ఉత్ప్రేక్ష 3) యమకం 4) రూపక

**20.** "విషయాన్ని ఉన్నదానికంటే ఎక్కువచేసి చెప్పడం" ఏ అలంకార లక్షణం? ( )

1) స్వభావోక్తి 2) వృత్యానుప్రాస 3) అనుప్రాస 4) అతిశయోక్తి

www.eenadupratibha.net

# పార్ట్ – A

## సమాధానాలు

**I. అవగాహన – ప్రతిస్పందన**

**1) కింది పద్యాల్లో ఒకదానికి ప్రతిపదార్థం రాయండి.**

**(అ)** నీరము తప్తలోహమున నిల్చి యనామకమైనశించు, నా
నీరము ముత్యమట్లు నళినీదళ సంస్థితమై తనర్చునా
నీరమె శుక్తిలోబడి మణిత్వముగాంచు సమంచిత ప్రభన్
పౌరుషవృత్తులిట్లధమ మధ్యమనుత్తము గొల్చువారికిన్

| జ: | | |
|---|---|---|
| | నీరము | = నీరు |
| | తప్తలోహమునన్ | = వేడెక్కి ఉన్న ఇనుములో |
| | నిల్చి | = నిలబడి |
| | అనామకమై | = కనిపించకుండా |
| | నశించున్ | = పోతుంది |
| | ఆ నీరము | = ఆ నీరే |
| | నళినీదళ | = తామరాకులో |
| | సంస్థితము + ఐ | = ఉన్నప్పుడు |
| | ముత్యము + అట్లు | = ముత్యంలా |
| | తనర్చున్ | = కనిపిస్తుంది |
| | ఆ నీరము | = ఆ నీరే |
| | శుక్తిలోన్ + పడి | = ముత్యపు చిప్పలో పడి |
| | సమంచిత | = చక్కని |
| | ప్రభన్ | = ప్రకాశంతో |
| | మణిత్వమున్ | = ముత్యం యొక్క రూపాన్ని |
| | కాంచున్ | = పొందుతుంది |
| | అధమున్ | = నీచుడిని |
| | మధ్యమున్ | = మధ్యముడిని |
| | ఉత్తమున్ | = ఉత్తముడిని |
| | కొల్చువారికిన్ | = సేవించేవారికి |
| | పౌరుష | = పురుషునకు సంబంధించిన |
| | వృత్తులు | = ప్రవర్తనలు |
| | ఇట్లు | = ఈ విధంగా ఉంటాయి |

www.eenadupratibha.net
www.eenadupratibha.net

**(ఆ)** సురుచిరతారకాకుసుమశోభి నభోంగణభూమిc గాలమ
న్గరువపుసూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపcగ నిశాసతి కెత్తిన క్రొత్తతోcపుcబెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమదిక్తటంబునన్

| | | |
|---|---|---|
| జ: | సురుచిర | = మనోహరమైన |
| | తారకా | = నక్షత్రాలనే |
| | కుసుమ | = పూలతో |
| | శోభి | = అలంకరించిన |
| | నభః | = ఆకాశమనే |
| | అంగణభూమిన్ | = రంగస్థలంపై |
| | కాలము+అన్ | = కాలమనే |
| | గరువపు | = గొప్ప |
| | సూత్రధారి | = దర్శకుడు |
| | జతనంబునన్ | = ప్రయత్నంతో |
| | దిక్పతికోటి | = దిక్పాలకుల సమూహం |
| | ముందటన్ | = ఎదుట |
| | సరసముగాన్ | = చక్కగా |
| | నటింపగన్ | = నాట్యం చేయడానికి సిద్ధపడిన |
| | నిశాసతిన్ | = రాత్రి అనే స్త్రీకి (వెనుక) |
| | ఎత్తిన | = నిలిపిన |
| | క్రొత్త | = కొత్తదైన |
| | తోపు | = ఎర్రని రంగు గల |
| | పెను + తెర | = పెద్ద తెర ఏమో |
| | అనన్ | = అన్నట్లుగా |
| | పశ్చిమదిక్ | = పడమటి దిక్కు |
| | తటంబునన్ | = తీరంలోని |
| | సాంధ్య | = సంధ్యాకాలపు |
| | నవ | = కొత్త |
| | దీధితి | = వెలుగు |
| | ఒప్పెన్ | = ప్రకాశించింది |

www.eenadupratibha.net

**2.** **కింది పద్యాల్లో ఒకదాన్ని పాదభంగం లేకుండా పూరించి, భావం రాయండి.**

**(అ)** "ఆ - యేమీ? ఒకరాణివాసమును ....

.... యౌద్ధత్యమోర్వన్ జుమీ".

జ: "ఆ-యేమీ? యొక రాణివాసమును బుణ్యావాసమున్ దెచ్చినా

వా? యేహైందవుఁడైన నీ గతి నమర్యాదన్ బ్రవర్తించునే?

మా యాజ్ఞన్ గమనింపవో? జయ మదోన్మాదంబునన్ రేఁగి, నీ

యాయుస్సూత్రము లీవ త్రుంచుకొనెదో? యౌద్ధత్య మోర్వన్ జుమీ"

**భావం:** ఆ... ఏమిటి? పుణ్యానికి నిలయమైన ఒక రాణివాసాన్ని బందీగా తెచ్చావా? ఏ హైందవుడైనా ఈ విధంగా అమర్యాదగా ప్రవర్తిస్తాడా? మా ఆజ్ఞను నీవు గమనించలేదా? విజయగర్వంతో చెలరేగి నీ ప్రాణానికి నీవే ఆపద తెచ్చుకుంటావా? నీవు చేసిన ఈ పనిని నేను సహించను.

**(ఆ)** దెసలను కొమ్మలొయ్య ....

.... బ్రాకెసమత్తుసకాకృతిన్

జ: దెసలను కొమ్మలొయ్యనతిదీర్ఘములైన కరంబులన్ బ్రియం

బెసఁగఁగ నూఁది నిక్కి రజనీశ్వరుఁ డున్నతలీలఁ బేర్చు నా

కస మను పేరి భూరుహము కాంతనిరంతర తారకా లస

త్కుసమ చయంబు గోయుటకొకో యనఁ బ్రాఁకె సముత్సుకాకృతిన్

**భావం:** దిక్కులనే కొమ్మలతో, వెలుగులీనే చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులా కనిపిస్తుంది ఆకాశం. చంద్రుడు తన చేతులతో (కిరణము)లతో ఆ పూవులను అందుకునేందుకా అన్నట్లు విజృంభించాడు.

**కింది పరిచిత గద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అర్థములు నిత్యములు గావు. యౌవనముఝరీవేగతుల్యము. జీవనము బుద్బుదప్రాయము. కాబట్టి బుద్ధిమంతుడు సత్వరముగా ధర్మము సమాచరింపవలెను. సమాచరింపనివాడు పశ్చాత్తాపము బొంది శోకాగ్ని సంతప్తుడగును. నీవతి సంచయము చేసితివి. దాని దోషమిది. కాబట్టి యతి సంచయేచ్ఛ తగదు.

ప్రశ్నలు:

**3.** **జీవనం ఎలాంటిది?**

జ: జీవనం బుద్బుదప్రాయము

**4.** **బుద్ధిమంతుడు దేన్ని సమాచరింపవలెను?**

జ: బుద్ధిమంతుడు ధర్మమును సమాచరింపవలెను.

**5.** **ధర్మాన్ని సమాచరింపనివాడు ఏమవుతాడు?**

జ: ధర్మాన్ని సమాచరింపనివాడు శోకాగ్ని సంతప్తుడగును

**6.** **పై పేరా ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.**

జ: ఏవి నిత్యములు కావు?

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

**7.** **దాశరథీ శతకకర్త గురించి మీకు తెలిసిన విషయాలు రాయండి.**

జ: దాశరథీ శతకకర్త కంచర్ల గోపన్న. ఇతడిని భక్త రామదాసుగా కూడా పిలుస్తారు. గోపన్న 17వ శతాబ్దానికి చెందినవాడు. శ్రీరాముడిపై అనేక కీర్తనలు రాశాడు.

**8. ధన్యుడు పాఠ్యభాగ నేపథ్యం రాయండి.**

జ: మంచి మిత్రుల కలయిక మన జీవితాన్ని మలుపు తిప్పుతుంది. అందుకే ఎప్పుడూ మంచి మిత్రులను పొందాలని పెద్దవాళ్లు అంటుంటారు. సజ్జన సాంగత్యం గురించి చెప్పడమే ఈ పాఠ్య నేపథ్యం.

**9. దీనులకు అన్నదానం చేస్తే కలిగే మేలు ఏమిటి?**

జ: వివేకవంతుడు భగవంతుడు తనకిచ్చినదానిలో అనాథలు, దీనులను కసురుకోక ఆప్యాయతతో లాలిస్తూ భోజనం పెట్టడం వల్ల సంపదలు అతడికి తెలియకుండానే వచ్చి చేరతాయి.

**10. కాలం విలువైందని సమర్థిస్తూ నాలుగు వాక్యాలు రాయండి.**

జ: కాలం అత్యంత విలువైంది. గడచిపోయిన కాలం తిరిగి రాదు. తాను చేయదలచుకున్న పనిని వాయిదా వేయకుండా ఉంటే సమయం సద్వినియోగమవుతుంది. విద్యార్థులు ఏయే సమయాల్లో ఏయే పనులు చేయాలో గుర్తెరిగి ప్రవర్తించాలి.

**కింది ప్రశ్నల్లో ఒక్కోదానికి 10 – 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి.**

**11. శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించి, ఆయన మనందరికీ ఎలా ఆదర్శప్రాయుడో వివరించండి.**

జ: శివాజీ స్త్రీల పట్ల గౌరవాదరాలు, భక్తి ప్రపత్తులు గలవాడు. స్త్రీలు భూమి మీద తిరిగే పుణ్య దేవతలని, భాగ్య కల్పలతలని, అగ్ని జ్వాలల లాంటి వారని భావించేవాడు. తన సర్దారు వల్ల జరిగిన తప్పును తన తప్పుగా భావించి మన్నించమని వేడుకున్న పశ్చాత్తాప్త హృదయం గలవాడు. స్త్రీలను బంధించడం అమర్యాదగా భావించి సోన్‌దేవుడిని శిక్షిస్తానని హెచ్చరించిన ధర్మవర్తనుడు. తన సేనాని చేసిన తప్పును తానే సరిదిద్ది ఆమెను మాతృమూర్తిగా భావించి, గౌరవించి, మంచి మాటలతో ఆదరించి, సత్కరించిన దయామయుడు. సోన్‌దేవుడు చేసిన తప్పును క్షమించిన శాంతమూర్తి.

శివాజీ నేటితరానికి ఆదర్శప్రాయుడు. రాజుననే అహంకారం లేనివాడు. స్త్రీలను గౌరవించడంలోనూ, చెప్పిన మాటకు కట్టుబడటంలోనూ, సంస్కృతీ సంప్రదాయాలను గౌరవించడంలోనూ మనందరికీ మార్గదర్శి. శివాజీలా అందరూ ప్రవర్తించినట్లయితే సంఘంలో అమానవీయ సంఘటనలు జరగవు.

**(లేదా)**

ప్ర: **వెన్నెల ఎలా విస్తరించిందో వర్ణిస్తూ రాయండి.**

జ: **వెన్నెల విస్తరించిన విధం:** దిక్కులనే కొమ్మలతో, వెలుగులీనే చుక్కలనే పూవులతో పెద్ద చెట్టులా కనిపిస్తున్న ఆకాశంలోని పువ్వులను కొయ్యడానికన్నట్లు చంద్రుడు విజృంభించాడు. పాలసముద్రం నుంచి పుట్టిన ఉప్పెనలా వెన్నెల విజృంభించి దిక్కులన్నీ ముంచెత్తింది. చంద్రబింబం ఆదిశేషుని పాన్పులా కనిపించింది. వెన్నెలకాంతితో చంద్రుడు చంద్రకాంత శిలలను కరిగిస్తూ, విహరిస్తున్న చకోరపక్షుల రెక్కలను స్పృశిస్తూ, వికసిస్తున్న కలువపూల రంధ్రాలను నింపి, అందమైన స్త్రీల అద్భుతమైన చిరునవ్వుల తెల్లని తరంగాలను పెంపు చేసింది.

వెన్నెల అంతకంతకూ అధికమై, పొంగి పొంగి దిశలన్నీ ముంచెత్తుతూ, సమస్తాన్నీ వెన్నెల అనే సముద్రపు నీటితో నింపుతూ, చాలా అందంగా, గంభీరంగా, సమున్నతంగా వెన్నెల విస్తరించింది. అవ్యక్తం అనే అనుమానాన్ని తలెత్తనీయక, కళ్లకు అమృత జల్లులా, శరీరానికి మంచి గంధంలా, మనసుకు ఆనంద తరంగంలా వెన్నెల విజృంభించింది.

**12. చరిత్ర నిర్మాతలుగా స్త్రీలే ప్రధానంగా ఉన్నారని సమర్థిస్తూ రాయండి.**

జ: **చరిత్ర నిర్మాతలుగా స్త్రీలే ప్రధానంగా ఉన్నారని సమర్థించడం:**

20వ శతాబ్దం 'స్త్రీ శతాబ్దం' అని చెప్పవచ్చు. స్వాతంత్ర్య ఉద్యమకాలం నుంచి నేటివరకూ ప్రతి ఉద్యమంలో స్త్రీలు సింహ భాగంగా ఉంటున్నారు. స్త్రీవిద్య మొదలైంది ఈ శతాబ్దంలోనే. స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వదేశీ ఉద్యమంలోనూ పాల్గొని జైలుకు వెళ్లిన స్త్రీలు ఎందరో ఉన్నారు. స్త్రీవిద్య కోసం ఉద్యమించినవారు, సాంఘిక దురాచారాలపై తిరుగుబాటు చేసినవారు కూడా ఉన్నారు. నాటకం, సినిమా, పత్రికా రంగాల్లో మొదటిసారి అడుగిడినవారు; కళాకారులు, వైద్యులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలుగా సమాజానికి, సాంస్కృతిక పురోభివృద్ధికి ఎంతోమంది సహకరించారు. అందుకే చరిత్ర నిర్మాణానికి స్త్రీలే ప్రధాన కారణమని నేను విశ్వసిస్తున్నాను.

www.eenadupratibha.net

(లేదా)

ప్ర: **రాజధానిగా అమరావతిని ఎంచుకోవడానికి కారణాలు రాయండి.**

జ: **రాజధానిగా అమరావతిని ఎంచుకోవడానికి కారణాలు:**

అమరావతి చారిత్రక, ఆధ్యాత్మిక నగరం. ఇది తొలి తెలుగు రాజులు శాతవాహనుల రాజధానిగా విలసిల్లింది. ఇక్ష్వాకులు, పల్లవుల లాంటి ఎన్నో రాజవంశాలు రాజధానిగా చేసుకుని పరిపాలించాయి.

అమరావతి గౌతమబుద్ధుడి పాదస్పర్శతో పునీతమై, ఆచార్య నాగార్జునుడు లాంటి విద్యావేత్తలకు, విద్యాలయాలకు నిలయమైంది. హిందూ, క్రైస్తవ, బౌద్ధమతాలకు ఆలయం మన అమరావతి. ప్రపంచ ప్రసిద్ధిచెందిన అమరావతి స్తూపం ఇక్కడే ఉంది. ఈ పుణ్యస్థలం పక్కనుంచే పవిత్ర కృష్ణానది ప్రవహించడం, ప్రసిద్ధి పంచారామాలలో ఒకటైన అమరేశ్వరుని ఆలయం ఉండటం, విజయవాడ, గుంటూరు నగరాలకు సమీపంలో ఉండటం వల్ల మన ప్రభుత్వ రాజధానిగా ఎంపిక చేసుకుంది.

## పార్ట్ – B సమాధానాలు

1-2; 2-1; 3-2; 4-4; 5-1; 6-2; 7-3; 8-2; 9-3; 10-4; 11-1; 12-3; 13-2; 14-3; 15-4; 16-1; 17-3; 18-3; 19-4; 20-4.

**రచయిత: కొంపల్లి లీలాకుమార్**